# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
## కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**30 జులై, 2022**

**విశ్వ ఆదివాసీ దినం సందర్భంగా దేశవ్యాప్తంగా జల్–జంగల్–జమీన్–ఇజ్జత్–అధికార్ కోసం జరుగుతున్న ఆదివాసీ పోరాటాలను ఎత్తిపట్టండి! వారిపై అణచివేతను గొంతెత్తి ఖండించండి!**

ఆగస్టు 9వ తేదీ విశ్వ ఆదివాసీ దినాన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2022 జూన్ 28వ తేదీన ప్రవేశపెట్టిన నూతన అటవీ సంరక్షణ నియమాలకు నిరసనగా, దండకారణ్య, బిహార్–జార్ఖండ్ ఆదివాసీ పోరాటాలకు మద్దతుగా కార్యక్రమాలు చేపట్టమని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపునిస్తున్నది.

పోరాటాల అణచివేత పేరుతో దేశ పాలకవర్గాలు ఆదివాసులపై మారణకాండలు సాగిస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భాజపా మోదీ ప్రభుత్వం ఒడిశా రాష్ట్రం మయూర్‌భంజ్ జిల్లా ఉపర్‌బేడ గ్రామంలో సంథాలీ ఆదివాసీగా జన్మించిన ద్రౌపది ముర్మును దేశ రాష్ట్రపతిగా గెలిపించింది. తమ రాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించిన తరువాత రాజ్యాంగం రూపొందించిన ఐదవ, ఆరవ షెడ్యూల్‌లకు, వాటి అమలు కోసం ఉన్న పెసా చట్టానికి విరుద్ధంగా, అత్యంత అప్రజాస్వామిక పద్ధతిలో నూతన అటవీ సంరక్షణ నిబంధనలను తీసుకువచ్చింది. ఈ షెడ్యూళ్ల, చట్టాల అమలులో దేశ రాష్ట్రపతికి, రాష్ట్రాల గవర్నర్‌లకూ ఉన్న అత్యున్నత బాధ్యతలు ఎన్నడూ వినియోగంలోకి రాలేదు. జల్–జంగల్–జమీన్–ఇజ్జత్–అధికార్ కోసం పోరాటాలు చేస్తున్న ఆదివాసులపై దమనకాండ సాగిస్తున్నది.

జార్ఖండ్ రాష్ట్రం గిరిడి జిల్లాలో పర్వతపూర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్–సుక్మా జిల్లాలలో సిలింగేర్ మొదలయిన ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా స్థానిక ఆదివాసీ ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. అలాగే ఒడిశా రాష్ట్రం నియంగిరి, మహారాష్ట్ర గఢ్‌చిరోలి జిల్లా సూర్జాగఢ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఆమ్‌దాయి, జార్ఖండ్ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో తరతరాలుగా నివసిస్తున్న ఆదివాసీ ప్రజలను విస్థాపితులను చేసి వారి భూమిని వందలాది ఒప్పందాల ద్వారా దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా విప్లవ, ప్రజాస్వామిక, సామాజిక సంస్థల నాయకత్వంలో పోరాటాలు జరుగుతున్నాయి. ఈ పోరాటాలపై సాగిస్తున్న అణచివేతను కప్పి పుచ్చుకోవడానికి మాత్రమే భాజపా ఆదివాసీ మహిళను దేశ రాష్ట్రపతిగా ఎన్నుకున్నది. ఆదివాసులు అధిక సంఖ్యలో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)పై, ప్రజల సైన్యం అయిన పీఎల్‌జీఏను, ప్రజల రాజ్యాధికార అంగం అయిన విప్లవ ప్రజా కమిటీలను అణచివేయాలని, భారత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలని ఒక దాని తరువాత మరొక నిర్బంధ క్యాంపెయిన్‌లను సాగిస్తున్నది.

అంతేకాకుండా, సుప్రీం కోర్టును నియంత్రించి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సార్కిన్‌గుడ, ఎడ్సమెట్టలలో గతంలో జరిగిన మారణకాండలకు ప్రభుత్వ కిరాయి బలగాలు బాధ్యులు కారంటూ తీర్పులు ఇప్పిస్తున్నది. రాజ్యాంగవిరుద్ధంగా, న్యాయవ్యవస్థ నియమాలకు విరుద్ధంగా, ఆదివాసుల హితం కోరి, వారి తరఫున కేసులు వేసిన వారికి, తమ హిందుత్వ ఎజెండాతో చేసిన ప్రజా వ్యతిరేక చర్యలు, మారణకాండలపై కోర్టులో పిటిషన్ వేసిన వారికి శిక్షలు విధిస్తున్నది. హిందుత్వ శక్తుల ద్వారా పత్రిక, టీవీ, సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటూ దేశంలో ఆదివాసీ, దళిత, అల్పసంఖ్యాక ప్రజలకు కనీస మద్దతు దొరకకుండా చేయాలని ప్రయత్నిస్తున్నది.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం మితిమీరుతున్న ఈ పరిస్థితుల్లో, దేశంలో నిజమైన ప్రజాస్వామ్యం కోసం యావత్తు పీడిత వర్గాలు, సెక్షన్‌లు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, సామాజిక కార్యకర్తలూ దానికి వ్యతిరేకంగా గొంతెత్తి నినదించాలి. రానున్న ఆగస్టు 9వ తేదీ విశ్వ ఆదివాసీ దినం సందర్భంగా ఆదివాసుల పోరాటాలను ఎత్తిపడుతూ, వారిని దోపిడీ చేసేందుకు తీసుకువస్తున్న వివిధ చట్టాలను వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపునిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా అటవీ ప్రాంతాలపై నియంత్రణ కోసం ఆదివాసులపై సాగుతున్న దోపిడీని వ్యతిరేకిస్తూ వారి పోరాటాలకు అండగా నిలవాలని పిలుపునిస్తున్నది.

Abhay

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**